# మూగ మనసులు

కమలని ఇప్పుడు చూస్తే మనస్సు కలుక్కుమంటుంది. చక్కగా తెలివితేటల్తో అందర్నీ ఆకట్టుకునేలా మాట్లాడడం, అంతకన్నా తీయగా పాటలు పాడటం కమలకి జన్మతః వచ్చిన కళ.

అంత్యాక్షరి ఆటలో కూచుందంటే పల్లవితో ఆగకుండా పాటంతా పాడేది. ఆమె పాడుతుంటే.. ఆటమాటే మర్చిపోయి పరవశించేవాళ్లం. ఆటల్లో చిన్నప్పుడు మాతో దెబ్బలాడేది. ఆ గొడవల్లో కూడా ఎంతో చాకచక్యంగా అరిచేసి మా తప్పు ఒప్పించేది. తనలా నిక్కచ్చిగా మాట్లాడుతుంటే "సరే తల్లీ సరే- సారీ!" అని స్నేహ బేరానికి వచ్చేవాళ్లం.

మగపిల్లలూ ఆడపిల్లలూ అన్న తేడాల్లేని వయస్సులో కమల మాతో స్నేహంగా కల్సిపోయేది. ముఖ్యంగా నేను కమల చలాకీతనానికి పులకించిపోయేవాణ్ణి. అందర్లోకి నేనంటే ప్రత్యేకమైన ఇష్టం చూపించటమే అందుకు కారణమేమో. పెరట్లో జామకాయా తోట్లో మావిడికాయా దొంగతనం చేసి పంచుకుని తినేవాళ్లం. మా నాన్న రామశాస్త్రిగారు పూజలు చేయించి కొబ్బరి చిప్పలూ, అరటిపళ్లూ తెచ్చేవారు. మిగిలిన అందరికీ పెట్టినా పెట్టకపోయినా నేను కమలకి మాత్రం ఇచ్చేవాణ్ణి. నేను పెద్దయ్యాక నాన్నంత బాగా పూజలు చేయించడం నేర్చేసుకుని ఇన్ని నైవేద్యాలు పట్టుకొచ్చి నీకు పెడతానని కమలకి చెప్పేవాణ్ణి.

ఏడో క్లాసు పరీక్షలు రాసిన కొన్నాళ్లకి కమల మా పిల్లల జట్టుతో తిరగడం హఠాత్తుగా మానేసింది. పైటేసి, పేరంటం చేశారు తనకి.

మూడు రోజులు గడిచాక కమలకి పట్టులంగా, పొట్టి జాకెట్టూ ఓణీ వేసి పుణ్యావచనం జరిపించారు. ఆ పూజకి నాన్నతోబాటు నేనూ పిల్ల పురోహితుల్లా వెళ్లాను. నేనప్పటికే నాన్న దగ్గర విఘ్నేశ్వర పూజా పుణ్యావచనం చేయించడంలో తర్ఫీదు పొందాను కనుక... కమలని మా జట్టుగాళ్లందరికన్నా నేను ముందు చూసే ఛాన్సు కలిగింది.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఆరోజు నాకు కమల రోజా కన్నా అందంగా కనిపించింది.

పసుపు వినాయకుడి బొమ్మ చేయడం, పూజకి కావల్సిన సంబారాలు అందించడంతోబాటు ఆచమనం, షోడశోపచారాల పూజా వగైరాలన్నీ నాన్న నాతో చేయిస్తూ నాకో చిన్న సైజు పరీక్ష పెడతారు అలాంటప్పుడు-

ఆరోజు పరీక్షలో నేను తప్పుల మార్కులు ఎక్కువ వేయించు కున్నాను. కారణం కమలే. కాదు ఆమె అందమేనేమో-

పసుపూ సున్నిపిండితో నలుగు పెట్టించుకుందేమో... బంగారం కమల రంగు చెమికీ బట్టల్లో కలిసిపోయింది- చక్రాల్లాంటి కళ్లకి ఇంత లావు కాటిక పెట్టారు. మెడనిండా ఇంట్లో వాళ్ల నగలు వేశారు. వాళ్ల చుట్టాలెవరి వడ్డాణమో సింగారించారు. బంతిపూల జడ, జడగంటలూ దిష్టి తగిలేట్లు పెట్టారు.

నాతో మామూలుగా మాట్లాడలేదు. చిరునవ్వే పలకరింపు అయింది. నేనూ తలెత్తి సూటిగా చూళ్లేక పోయాను. రోజూ చూసే అమ్మాయైనా ఏంటో మెలికలు తిరిగిపోయాను. మాటలు గొంతులోంచి గుండెల్లోకి దిగిపోయి చప్పుళ్లు చేశాయి. తనకీ ఆ మాటల్లేని మౌనమే భూషణం అయిపోయింది.

ఆ తర్వాత్తర్వాత మాట్లాడినా ఏంటో సగం మనసుదాచి మాట్లాడుతున్నట్లు ఉండేది. అది భయమో, సంకోచమో, వినయమో, ఏమిటోగానీ అందమైన మౌనం-

ఆ మౌనమే... కమల జీవితాన్ని బోర్లించేసి తారుమారు చేసింది.

అందుకే... కమలని ఇప్పుడు చూస్తే మనస్సు కలుక్కుమంటుంది. కమలకి ఇప్పుడు మాటలు రావు. పాటలూ రావు. కమల మూగది కాదుగానీ గొంతు మూగబోయింది. ఆ కథే - ఈ కథ.

✦ ✦ ✦

కమలకి పెళ్లి చూపులు జరిగాయి.

పెళ్లికొడుకు పట్నంలో ఏదో ఉద్యోగం. ఇంట్లో వాళ్లందరికీ నచ్చేశాడు. కానీ కమలకి... ఏమో??

చెప్పలేకపోయింది -

మౌనం!

ముహూర్తాలు కూడా పెట్టేశారు.

కమల చక్రాల్లాంటి కళ్లలో అసంతృప్తిని ఎవ్వరూ గమనించలేదు. తన అసంతృప్తిని తనూ నోరు విప్పి వెళ్లడించలేదు.

మౌనం!!

పెళ్లివారు వచ్చేశారు. ఎదురు సన్నాహాలు గట్రా జరుగు తున్నాయి. పెళ్లి కూతుర్ని చూసి వెళ్తున్నారు ఆ వచ్చిన మగపెళ్లివారు. నీరసమైన చిరునవ్వే అన్నింటికీ సమాధానంగా... మూగభాష అవుతోంది. అంటే మౌనమే..!!!

గౌరీ పూజ చేయిస్తున్న కమలకి ప్రధాన పురోహితుణ్ణి నేనే. కమల నాకు కాకుండా దూరంగా వెళ్లిపోతోంది!

నాకు దుఃఖాన్ని ఆపుకోవడం చేతైపోయింది! మగవాడి గుండె ముదురు కదా!!

కమల ఉండుండి నాకేసి చూడ్డం కళ్లలో నీళ్లు తిరగటం నేను గమనిస్తున్నాను. కానీ నా భ్రమేమో?? అగరొత్తుల పొగకేమో??

అగరొత్తులు తీసి పక్కన పెట్టాను... రెండు కన్నీటి బొట్లు వెచ్చగా నా చేతిమీద పడ్డాయి. కారణం నాకు తెల్సు... స్నేహానికి తెల్సు... మా హృదయాలకి తెల్సు - అయితే... మాటని కప్పెట్టుకుని మనసుని

మభ్యపెట్టేసుకున్నాం ఇద్దరమూను-

ఆ రోజు రాత్రే కమల పెళ్లి. పెళ్లి వేదిక మీద ఆడపిల్ల వైపు పురోహితుడుగా నేనూ కూర్చున్నాను. పెళ్లి వాళ్లందరికీ కమల మెళ్లో మెరియబోతున్న తాళిని ముట్టించాను. ఆమె శిరస్సున కురియబోతున్న అక్షతలు పంచాను.

పెళ్లికి ప్రధాన ముహూర్తాన తలపై వెలిసే జీలకర్ర బెల్లం ఉండలు చేసి అందించాను. పెళ్లికొడుకు కమల నెత్తిమీద జీలకర్ర బెల్లం పెట్టబోతున్నాడు.

కమల కెవ్వున కేకపెట్టి విరుచుకు పడిపోయింది.

అదే కమల గొంతు నేను ఆఖరిసారి విన్నది.

✦ ✦ ✦

కమలకి మూర్ఛరోగం అని నిందలు వేసి పెళ్లివారు అర్థాంతరంగా వెళ్లిపోయారు.

ఆ తర్వాత కమల ఎప్పుడూ మాట్లాడలేదు.

కమలకి మూర్ఛరోగం కాదూ... 'మూగ రోగం' అని నాకొక్కడికే తెల్సు. ఆ తర్వాత పెద్దవాళ్ల అభిప్రాయం మేరకు నేను 'సరస్వతి'ని పెళ్లి చేసుకున్నాను. మగాళ్ల గుండె ముదురు కదా... నేను నా కథని మర్చిపోయి ఒక పాపని కూడా కన్నాను. మా ఆవిడ దానికి పేరేదో పెట్టింది. కానీ నేను పెట్టుకున్న పేరు... కమల!! నేనెప్పుడూ ఆ పేరుతో పాపని పిలవలేదు. చిత్రం ఏంటంటే, మా పాపకి మాటలు రాలేదు. మూగది!! దాని చూసినప్పుడల్లా కమల కలుక్కుమని జ్ఞాపకం వస్తుంది.